కొత్తగూడెం రైల్వే సెంటర్‌లో రోడ్ షోకు తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఉమ్మడి ఖమ్మంలో అదే జో(హో)రు

- ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కేసీఆర్‌కు నీరా'జనం'
- కొత్తగూడెం రోడ్‌షోకు అడుగడుగునా పోటెత్తిన ప్రజలు

ఖమ్మం, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఊరూరా జనప్రభంజనం.. ఎటుచూసినా గులాబీ వనం.. కేరింతలు కొట్టిన అభిమానం.. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్రకు ఉమ్మడి ఖమ్మం జిల్లా లోనూ జనహోరు పోటెత్తింది. సోమవారం నాటి ఖమ్మం రోడ్‌షోకు కూడా అశేష జనవాహిని తరలిరాగా, మంగళవారం కొత్తగూడెం రోడ్‌షో కూడా అదే రీతిని తలపించింది. భద్రాద్రి రోడ్‌షోకు బస్సుయాత్ర ద్వారా బయలుదేరిన కేసీఆర్‌కు ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్ నుంచి కొత్తగూడెం వరకు అపూర్వ స్వాగతం లభించింది. కొత్తగూడెంలో రోడ్‌షో ముగిసిన అనంతరం అక్కడి సింగరేణి గెస్ట్‌హౌస్‌లో కేసీఆర్ బసచేశారు. అనంతరం కొత్తగూడెం చేరుకున్న ఉద్యమనేతను మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నేతృత్వంలో భారీ ర్యాలీతో తోడ్కొని వెళ్లారు. కేసీఆర్ ప్రసంగాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో విజయం సాధించడంపై కర్తవ్యబోధ చేశారు రోడ్ షోలో కేసీఆర్ ఉర్దూలో అనర్గళంగా ప్రసంగించి ముస్లిం మైనార్టీలను ఆకట్టుకున్నారు. 'బాయియోం.. ఔర్ బెహనోం..' అంటూ సంబోధించారు. లౌకికవాదాన్ని కాపాడేది, ముస్లిం మైనార్టీలకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీయేనని భరోసా ఇచ్చారు. అభిమాన నేతను చూసేందుకు వేలాదిగా జనం రోడ్లపైకి చేరారు. బస్సులోంచే కేసీఆర్ అభివాదం చేయగా.. ప్రతిస్పందనగా ఆయనకు అభివాదం చేస్తూ జేజేలు పలికారు.

కచ్చితంగ 12 సీట్లు గెలుస్తం

- కాంగ్రెస్‌వి అబద్ధపు హామీలు
- మోసపోయామని ప్రజలకు అర్థమైంది
- లిక్కర్ స్కాం రాజకీయ కుంభకోణం
- నేతలకు బెయిల్ ఎందుకు రాదో న్యాయవ్యవస్థ ఆలోచించాలి
- ఎన్నికల తర్వాత థర్డ్ ఫ్రంట్?
- బీజేపీకి 200 సీట్లు కూడా రావు
- 'ఏఎన్ఐ' ఇంటర్వ్యూలో కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : 'లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ 12 సీట్లు గెలుస్తుంది.. తెలంగాణకు ప్రధాన శత్రువులైన బీజేపీ, కాంగ్రెస్‌లతో మా పోరాటం కొనసాగుతుంది' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. ఏఎన్ఐకి మంగళవారం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన, సార్వత్రిక ఎన్నికల్లో ఏ కూటమికీ 272 సీట్ల సంపూర్ణ మెజార్టీ రాదని, కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కచ్చితంగా ప్రాంతీయ పార్టీలే కీలకం కాబోతున్నయని కుండబద్దలు కొట్టారు.

● మీ హయాంలో తెలంగాణకు ఎంత చేశారని భావిస్తున్నారు? ఎన్ని సీట్లు గెలుస్తారు?

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఉండాలన్నది నా కల. దాన్ని వందకు వంద శాతం సాధించిన. స్వరాష్ట్రంలో పాలన కూడా బాగా జరిగింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలకు ప్రజలు ఆకర్షితులైండ్రు. ఇప్పుడు మోసపోయినమని తెలుసుకున్నరు. ఈ లోక్‌సభ ఎన్నికల తర్వాత వంద శాతం మంచి పరిణామం ఉంటుంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కనీసం 12 సీట్లు గెలుస్తం.

● 12 సీట్లంటే.. రేవంత్‌కు ఇబ్బంది కదా?

ఎవరికి ఇబ్బందవుతుందనేది మాకు సంబంధం లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం మంచి పరిణామం కనిపిస్తుంది. తెలంగాణ ప్రజలకు మంచి జరుగుతుంది.

● ఎమ్మెల్సీ కవిత జైలులో ఉండటం వల్ల బీఆర్ఎస్‌పై ప్రభావం ఉంటుందా?

మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులందరినీ ఇబ్బంది పెట్టింది. ఎన్ని చోట్ల ఎమ్మెల్యేలను కొన్నరు, ఎంత మంది సీఎంలను గద్దె దింపిండ్రు, ఎన్ని ప్రభుత్వాలను కూలదోసిండ్రు, ఎన్ని అరాచకాలు చేసిండ్రో ప్రజలందరికీ తెలుసు. నాపై, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌పై మాత్రం వాళ్లు చెయ్యి వెయ్యలేకపోయిండ్రు. మేం ప్రజానాయకులం, శక్తివంతమైన నేతలం కాబట్టి మా వరకు రాలేకపోయిండ్రు. అందుకే మమ్మల్ని రాజకీయంగా దెబ్బతీసేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కేంద్రంగా నాటకం రచించిండ్రు. ఢిల్లీ ప్రభుత్వం చేసిన ఎక్సైజ్ పాలసీని ఒక కుంభకోణంగా చిత్రీకరించిండ్రు. అసలు మద్యం పాలసీలో అవినీతికి అవకాశమే లేదు. ఇదొక తప్పుడు కేసు. ఇప్పటివరకు రూపాయి కూడా పట్టుబడలేదు. కానీ, ఈ కేసును అడ్డం పెట్టుకొని కేజ్రీవాల్‌ను, ఎమ్మెల్సీ కవితను జైలులో పెట్టిండ్రు. వాళ్లిద్దరూ నిర్దోషులు. నేను దేశ ప్రజలకు మరోసారి స్పష్టంగా చెప్తున్నా. ఢిల్లీ లిక్కర్ స్కాం అనేది అసలు స్కామే కాదు. ఇది మోదీ సృష్టించిన రాజకీయ కుంభకోణం మాత్రమే. ఎవరిని జైలులో పెడుతున్నరు? ఎవరిని వదిలేస్తున్నారో చూస్తే ఇది స్పష్టంగ అర్థమవుతుంది. ఒక వ్యక్తి ఈ కేసులో అప్రూవర్‌గా మారగానే అతనికి బెయిల్ వచ్చింది. ఆయన బయటికి వెళ్లి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి రూ.50 కోట్లు చందా ఇచ్చిండు. ఒక ముఖ్యమంత్రికి బెయిల్ ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమో న్యాయస్థానాలు ఆలోచించాలి. నా బిడ్డ కవిత ఓ ఎమ్మెల్సీ, స్టార్ క్యాంపెయినర్. ఆమె ఎక్కడికైనా పారిపోతుందా? ఎందుకు బెయిల్ దొరుకడం లేదు?. నెలలపాటు జైలులో ఎలా ఉంచుతారు?. ఒకవేళ రేపు నిర్దోషిగా తేలితే.. ఇంతకాలం జరిగిన నష్టాన్ని ఎలా పూడ్చుతారు?. న్యాయవ్యవస్థకు నా విన్నపం ఏమిటంటే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్, ఎమ్మెల్సీ కవిత వంటి వారిని ఎప్పటివరకు జైలులో ఉంచుతారో ఆలోచించాలి. వారికి వెంటనే ఉపశమనం కల్పించాలి.

● మీ పోటీ కాంగ్రెస్‌తోనా? బీజేపీతోనా?

మేము రెండు పార్టీలతో పోరాడుతున్నం. కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు శత్రువులు. అనేక అంశాల్లో ఇది రుజువైంది. అందుకే రెండు పార్టీలతో మా పోరాటం కొనసాగుతుంది.

మీ రాజకీయ లక్ష్యం ఏమిటి?

టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారిందే జాతీయ స్థాయిలో మరింత విస్తరించేందుకు. మహారాష్ట్ర నుంచి ప్రారంభించినం. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో కూడా కొంత పనిచేసినం. అనుకోకుండా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినం. నా దృష్టిలో ప్రాంతీయ పార్టీలు ఒకేచోట పరిమితం కాకూడదు.

● థర్డ్ ఫ్రంట్‌కు అవకాశం ఉన్నదా?

కచ్చితంగా ఉన్నది. దేశంలో కాంగ్రెస్, బీజేపీలు సొంతంగా అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీల బలం పెరిగింది. బెంగాల్, ఢిల్లీ, పంజాబ్ ఇందుకు ఉదాహరణ. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలు కీలక పాత్ర పోషించబోతున్నయ్.

● ఎన్డీయే ప్రధాని అభ్యర్థి మోదీ, ఇండియా కూటమి నుంచి ఎవరు?

ఇప్పుడే చెప్పడం తొందరపాటవుతుంది. ఈ ఎన్నికల్లో ఏ కూటమికి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజార్టీ రాదు. ఎన్డీయే కూటమి కూడా పెద్దదేం కాదు. ఎన్డీయేకు 200 సీట్లు కూడా దాటవు. ఫలితాల తర్వాత విపక్షాలు, ప్రాంతీయ పార్టీలు మాట్లాడుకొని నిర్ణయం తీసుకుంటయ్.

● కాంగ్రెస్, బీజేపీకి ప్రతికూల అంశాలేమిటి?

ఈ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఓటెయ్యబోతున్నరు. ఇక కాంగ్రెస్ హయాంలో జరిగిన కుంభకోణాలు, అవినీతి గురించి ప్రజలందరికీ తెలుసు. రైతులకు బీజేపీ, కాంగ్రెస్‌లు అన్యాయం చేసినయ్.

జమ్మికుంట మండలం వావిలాల రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలు

కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు తరలివచ్చిన ప్రజలు

ఇది గ్యారెంటీ సర్కార్ కాదు

గారడీ సర్కార్

- నమ్మితే మునుగుడు ఖాయం
- ఆ పార్టీ అసమర్థతోనే కరువు
- బండి మత రాజకీయాలు తప్ప చేసిందేమీలేదు
- నన్ను గెలిపిస్తే ప్రజా గొంతుకనవుతా.. అభివృద్ధి చేస్తా
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

జమ్మికుంట మండలం వావిలాల రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట/ కరీంనగర్‌రూరల్, ఏప్రిల్ 30 : కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ సర్కారు కాదని, గారడీ సర్కారని, నమ్మితే మునుగుడు ఖాయమని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. ఉద్దెర హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లేవని చెప్పారు. నాలుగు నెలల పాలనలో ప్రాజెక్టులు, చెరువులు ఎండాయని, ప్రభుత్వ అసమర్థతతోనే రాష్ట్రంలో కరువు వచ్చిందని మండిపడ్డారు. నూటాయాభై రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, గ్యారెంటీలు అమలు చేయకుంటే కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమని హెచ్చరించారు. ప్రస్తుతం ఎన్నికల బరిలో ఉన్న నాయకులపై చర్చ జరగాలని, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ ఎవరికీ తెలియదని, బీజేపీ అభ్యర్థి బండి చేసిందేమీ లేదని, తాను గతంలో చేసిన అభివృద్ధి గురించి తెలుసుకోవాలని కోరారు. బండి సంజయ్ మత రాజకీయాలు తప్ప ప్రజల కోసం చేసిందేమీ లేదని, అభివృద్ధి కోసం ఐదు పైసలు కూడా తేలేదని విమర్శించారు. ఆయనకు ఓట్లడిగే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే పార్లమెంటులో ప్రజల గొంతుకనవుతానని, కరీంనగర్ జిల్లాను గొప్పగా తీర్చిదిద్దుతా హామీనిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి జమ్మికుంట మండలంలోని వావిలాలలో రోడ్‌షో నిర్వహించారు. సాయంత్రం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో కార్నర్ మీటింగ్‌లో ఏర్పాటు చేశారు. ఆయాచోట్ల వినోద్‌కుమార్ ప్రజలనుద్దేశించి ఆయాచోట్ల ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఐదేళ్లలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ట్రిపుల్ఐటీ, నవోదయ పాఠశాలలు తెచ్చి విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తెచ్చానని, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్, మానేరు నదిపై తీగల వంతెన, మానేరు రివర్ ఫ్రంట్, ఐటీ టవర్, శాతవాహన యూనివర్సిటీ దగ్గర నైట్‌లైట్ నిర్మాణం, తదితర అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. టీటీడీ నుంచి ₹25 కోట్ల నిధులతో పది ఎకరాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మాణం చేయిస్తున్నామని చెప్పారు. కొండగట్టు ఆలయానికి 334 ఎకరాల ప్రభుత్వ స్థలం ఇచ్చేందుకు కృషి చేశానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో తాను చేసిన అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారని, కాంగ్రెస్‌ను నమ్మి ఆగమైపోవద్దని సూచించారు. ఆయాచోట్ల రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కేడీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్, ఎంపీపీలు మమత, తిప్పర్తి లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ తిరుపతిరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, సర్పంచ్ బోగొండ లక్ష్మీఐలయ్య, ప్యాక్స్ చైర్మన్ తోట తిరుపతి, కో ఆప్షన్ సభ్యుడు రఫీ, నాయకులు మల్లేశం, వేల్పులనారాయణ, బుర్ర తిరుపతి, చల్ల లింగారెడ్డి, సత్యనారాయణరావు, రాజేశ్వర్‌రావు, సుంకిశాల సంపత్‌రావు, ఉప్పుల శ్రీధర్, రాము, జక్కం నర్సయ్య, దబ్బెట రమణారెడ్డి పాల్గొన్నారు.

నమ్మితే కాలగర్భంలోకే

ఎంపీగా పోటీ చేస్తున్న వినోద్‌కుమార్‌కు ఏడు నియోజకవర్గాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నరు. మళ్లీ కాంగ్రెస్ మాటలు నమ్మి గోసపడేందుకు సిద్ధంగా లేమని చెబుతున్నరు. హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు వస్తున్న ప్రజాధరణకు భయపడి కాంగ్రెస్ సభ పెట్టింది. కాంగ్రెస్, బీజేపీని నమ్మితే అందరినీ కాలగర్భంలో కలుపుతరు.

- వావిలాలలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కాంగ్రెస్ వచ్చినంకనే నీటి కష్టాలు

కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ మొత్తం పచ్చగా ఉండేది. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత కరెంట్, సాగు, తాగునీటి కష్టాలు మొదలైనయి. వ్యవసాయం కుంటు పడింది. కేసీఆర్ సీఎంగా లేనిలోటు స్పష్టంగా కనిపిస్తున్నది. వినోద్ కుమార్‌ను గెలిపిస్తే మేమిద్దరం జోడెద్దుల్లా పనిచేస్తం. డబుల్ ఇంజిన్ అంటే నేను, వినోద్‌కుమార్. ఇద్దరం కలిసి అభివృద్ధి చేస్తం.

- చామనపల్లిలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

జీవన్‌రెడ్డి, అర్వింద్ అబద్ధాలకోరులు

నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

మాట్లాడుతున్న నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, పక్కన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే షుగర్ ఫ్యాక్టరీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న జీవన్‌రెడ్డి అబద్ధాల కోరైతే, పసుపుబోర్డు, చెక్కర ఫ్యాక్టరీ విషయంలో బాండ్ పేపర్ రాసి ఎన్నికల్లో గెలిచిన ఎంపీ ధర్మపురి అర్వింద్ డబుల్ అబద్ధాల కోరని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఘాటుగా విమర్శించారు. సిగ్గులేనివాది, మతతత్వవాదులు కలిసి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పనిచేస్తున్నారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే సీఎం రేవంత్‌రెడ్డి మెడలు వంచైనా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయిస్తామని స్పష్టం చేశారు. రాయికల్ మండలం, జగిత్యాల రూరల్ మండలాల్లో మంగళవారం కార్నర్ మీటింగులు నిర్వహించిన ఆయన, సాయంత్రం జగిత్యాల బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలను మభ్య పెట్టి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీనీ సైతం అమలు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి షుగర్ ఫ్యాక్టరీ పేరిట ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని చెప్పారు. నిజానికి 2004 నుంచి 2014 దాకా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని, అప్పుడే మంత్రి రత్నాకర్‌రావు నేతృత్వంలో షుగర్ ఫ్యాక్టరీ గురించి కమిటీ వేశారన్నారు. అందులో అప్పటి మంత్రి జీవన్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యేగా ఉన్న తాను సైతం సభ్యులుగా ఉన్నామన్నారు. అప్పుడు షుగర్ ఫ్యాక్టరీని తెరిపించలేని జీవన్‌రెడ్డి.. ఇప్పుడు దాని గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో షుగర్ ఫ్యాక్టరీ గురించి అధ్యయనం చేయించారని, రైతు సహకార సంఘాల ఆధ్వరంలో షుగర్ ఫ్యాక్టరీలు నిర్వహించేందుకు సీఎం కేసీఆర్ అంగీకరించారని, దాని కోసం ₹500 కోట్లు వెచ్చించేందుకు సైతం సిద్ధమయ్యారన్నారు. అయితే అది కార్యరూపం దాల్చలేదన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలు, రేవంత్‌రెడ్డి తప్పుడు హామీలు ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా నిధులను తెస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీ ఎల్ రమణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లోక బాపురెడ్డి పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలెక్కడ?

పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ధర్మపురిలో ఓటు అభ్యర్థిస్తున్న కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, ఏప్రిల్ 30: ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ఎక్కడ అమలు చేసిందో చెప్పాలని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం ధర్మపురిలో ప్రచారం చేశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడవకముందే 230 మంది రైతులను పొట్టనబెట్టుకున్నదని ఆరోపించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, కౌన్సిలర్లు వేణు, అశోక్, యూనుస్, కార్తీక్,అనంతుల విజయలక్ష్మి, నాయకులు సంగి శేఖర్, అక్కనపల్లి సునీల్‌కుమార్, చిలివేరి శ్యాంసుందర్, రాజన్న ఉన్నారు.